క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ పక్కాగా అమలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

నక్కపల్లి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కోడ్ పక్కాగా అమలు చేయాలని ఎంపీడీవో డి. సీతారామరాజు తెలిపారు. గురువారం ఆయన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల ఫొటోలతో బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలన్నారు. వచ్చే నెల ఒకటో తేదీన పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేయాలన్నారు. అదే రోజు నూరుశాతం పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. పంపిణీ రోజున మోనటరింగ్ సెల్ నుంచి వచ్చే ఫోన్ కాల్‌ను ఆన్సర్ చేయాలన్నారు.

డ్రైనేజీ నిర్మాణాలకు శంకుస్థాపన



డ్రైనేజీ నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

ఎస్.రాయవరం: భీమవరంలో సుదీర్ఘ సమస్యగా ఉన్న డ్రైనేజీలు పూర్తిస్థాయిలో నిర్మాణం చేపడతామని సర్పంచ్ గరగా నూకరాజు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.10 లక్షలు కేటాయించి డ్రైనేజీ నిర్మాణ పనులు గురువారం ఆయన ప్రారంభించారు. నెల రోజుల వ్యవధిలో కాలువలు నిర్మాణాలు పూర్తి చేసి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గరగా శ్రీనివాసరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటుపడాలి




అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు

మునగపాక: బీజేపీ మండల అధ్యక్షుడు మళ్ల కాలేశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలోని ఉమ్మలాడలో నందివాన్ గౌరవ దివస్ అభియాన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేష్ హాజరై రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటు పడాలన్నారు. అంబేడ్కర్ రచనల ద్వారా ఎంతోమంది పలు రంగాల్లో రాణిస్తున్నారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ మాస్టారు, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు జేవీఎస్ వర్మ, జిల్లా గౌరవాధ్యక్షులు మొల్లేటి వాసు, వెంకట జగదీశ్వరరావు, రామకృష్ణ, శ్రీనివాసరావు, విజయకుమార్, గణేష్, మద్దాల రాము తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన

మునగపాక: ప్రతి ఒక్కరూ హక్కులపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ పి.ప్రసాదరావు కోరారు. పౌరహక్కుల దినోత్సవ సందర్భంగా గురువారం గణపర్తి దళితవాడలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కులమతాలకు అతీతంగా నడుచుకోవాలన్నారు. ఎటువంటి వివాదాలకు తావులేకుండా సాధ్యమైనంత వరకు సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకోవాలన్నారు. తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ మారిశెట్టి వెంకటరమణ, జనసేన పార్టీ నాయకులు టెక్కలి పరశురామ్, కాళ్ల చంద్రమోహన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నవోదయ మోడల్ టెస్ట్ విజేతలకు బహుమతులు



విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న గోపినాథ్

అనకాపల్లి: నవోదయ మోడల్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన పట్టణానికి చెందిన ఐదుగురు విద్యార్థులకు గురువారం స్థానిక నర్సింగరావుపేట పీఆర్టీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గోపినాథ్ జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎనిమిది కేంద్రాల్లో నవోదయ మోడల్ టెస్ట్ నిర్వహించగా వెయ్యి మంది విద్యార్థులకు హాజరయ్యారన్నారు. యూనియన్ పట్టణ గౌరవాధ్యక్షుడు బుద్ధ కాశీవిశ్వేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దినాయుడు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. అదమరిస్తే ప్రమాదం



రాకాసి అలలకు కోతకు గురయిన తీరం గట్టు

- ప్రమాదకరంగా మారిన రేవుపోలవరం తీరం
- లోతు తెలియక మృత్యువాత
- కానరాని భద్రతా చర్యలు

ఎస్.రాయవరం: సువిశాల సాగర తీరంలో సముద్ర అలల హోరులో వచ్చిన చల్లని గాలులు ఎంతగానో ఆహ్లాదపరుస్తుంటాయి. అంతకంటే ఇక్కడ కెరటాల రూపంలో మృత్యువు పొంచి ఉంది. సరదాగా ఈతకు దిగిన ఎంతోమంది పర్యాటకులను పొట్టన పెట్టుకుంది. ప్రముఖ పర్యాటక కేంద్రం రేవుపోలవరం తీరంలో దుస్థితి ఇది. ఇక్కడ ఎగసిపడే రాకాసి అలలు ధాటికి గట్టు కోతకు గురికావడమే కాకుండా గర్భంలో గోతులు ఏర్పడి స్నానాలు రేవు ప్రమాదకరంగా మారింది. ఇది తెలియని పర్యాటకులకు లోతు తక్కువ అనుకుని దిగి కెరటాలకు కొట్టుకుపోయి మృత్యువాత పడుతున్నారు. ఇలా మూడు నెలలు వ్యవధిలో నలుగురు మృత్యువాత పడ్డారు. ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా రేవుపోలవరం తీరాన్ని అభివృద్ధి చేస్తామని ముందుకు వచ్చినప్పటికీ పనులు మొక్కుబడిగా చేసి వదిలేశారు.

అయితే తీరానికి రోజు రోజుకీ పర్యాటకులు తాకిడి పెరుగుతున్నప్పటికీ ప్రభుత్వ సదుపాయాలు ఏర్పాటు చేయలేదు. కనీసం తీరంలో సరదాగా స్నానాలు చేసే వారికి సైతం రక్షణ లేకుండా పోయింది. తీరంలో ఎక్కడ ఈతకు దిగవచ్చు.. ఎక్కడ దిగవద్దు అనే హెచ్చరిక బోర్డులు కానరాలేదు.



గతంలో పోలిస్తే 150 మీటర్లు ముందుకు వచ్చిన సముద్రం..



ప్రమాదకరంగా మారిన రేవుపోలవరం స్నానాల రేవు

మెరైన్ పోలీసులు మాత్రం వీకెండ్‌లో పర్యాటకులతో పాటు వచ్చి వెళ్తున్నారు. ప్రమాదాలు చోటు చేసుకుంటే మత్స్యకారులు మాదిరిగా సహాయక చర్యలు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ప్రమాదాలు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టలేదు. సివిల్ పోలీసులు జాడ మాత్రం కానరాలేదు. పర్యాటకులు వచ్చి వెళ్తున్నా, వారికి అవసరమైన బందోబస్తు ఇవ్వడం లేదు. ప్రమాదాలు జరిగాయని సమాచారం ఇస్తే తీరానికి పరుగులు తీస్తున్నారు తప్ప.. పికెట్ నిర్వహించలేదు. దీంతో పర్యాటకుల్లో కొంతమంది మద్యం సేవించి వీరంగం సృష్టించి మహిళలను, యువతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇదే తరహాలో యువకులు మద్యం వివాదాలు చోటు చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. ఆహ్లాదకర ప్రాంతాల్లో పర్యాటకులు ఆశలకు అనుగుణంగా సదుపాయాలు, రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



రేవు పోలవరం తీరంలో అసంపూర్తిగా వదిలేసిన పర్యాటక వసతులు

పర్యాటకులకు రక్షణ కల్పించడం లేదు



రేవుపోలవరం తీరానికి నిత్యం పర్యాటకులు రాక మొదలైంది. శని, ఆదివారాల్లో మరింత ఎక్కువగా వస్తున్నారు. పోలీస్ సిబ్బంది మాత్రం ఉండటం లేదు. మెరైన్ సిబ్బంది ఒకరు లేక ఇద్దరు ఉంటున్నారు. వారు ఉన్నచోట నుంచి పర్యాటకులకు అవగాహన కల్పించి రక్షణ కల్పించలేకపోతున్నారు. స్నానాలు రేవు వద్ద గజ ఈతగాళ్లు గాటు చదును చేసే పనులు చేపట్టాలి. సివిల్ పోలీసుల గస్తీ ఉండాలి. మేము ఆపద మిత్రలో శిక్షణ పొందాం. అవసరమైన వారికి ఉచితంగా సేవలందిస్తున్నాం.

– చేపల రాజు, మత్స్యకార యువకుడు, కొత్త రేవుపోలవరం

గస్తీ ఉంచుతున్నాం..



రేవుపోలవరం బీచ్‌లో కొండ చుట్టూ తీరం గతుకులుగా ఉండి ప్రమాదకరంగా మారింది. సుమారు 12 హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. మరిన్ని బోర్డులు ఏర్పాటు చేసి, అవగాహన కార్యక్రమాలు పెంచుతాం. దూర ప్రాంతాల వారు ప్రమాదకర ప్రాంతంలో స్నానానికి దిగి ప్రాణాలు మీదకు తెచ్చుకుంటున్నారు. నిత్యం మెరైన్ పోలీసులు ఉంటున్నారు. రద్దీ ఎక్కువ ఉన్న సమయాల్లో సివిల్ పోలీసులు ఇద్దరేసి చొప్పున ఉంటున్నారు. గజ ఈతగాళ్లు, సదుపాయాల కల్పన టూరిజం, ఇతర శాఖల వారు పరిశీలించాలి.

– విభీషణరావు, ఎస్ఐ, ఎస్.రాయవరం

వాడ్రాపల్లి సర్పంచ్‌ను పరామర్శించిన ధర్మశ్రీ



సర్పంచ్ నూకరాజును పరామర్శిస్తున్న కరణం ధర్మశ్రీ

మునగపాక: మండలంలో వాడ్రాపల్లి సర్పంచ్ కాంట్రాక్టర్ నూకరాజును వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ గురువారం పరామర్శించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నూకరాజు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా స్వస్థత చేకూరాలని ఆకాంక్షించారు. వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తూ ఆరోగ్యవంతంగా ఉండాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎంపీపీ దాసరి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



పాడి రైతు కుటుంబ సభ్యులకు బీమా చెక్కు అందిస్తున్న నాయకులు

కోటవురట్ల: విశాఖ డెయిరీ పాడి రైతులకు అండగా ఉందని ఎంపీటీసీ సభ్యుడు పెట్ల రాంబాబు తెలిపారు. బి.కె.పల్లిలో ఇటీవల మృతి చెందిన పాడిరైతు కె.చినవెంకటస్వామికి సంబంధించి రూ.20 వేల బీమా చెక్కును ఆ కుటుంబానికి గురువారం అందజేశారు. ఎంపీటీసీ మాట్లాడుతూ విశాఖ డెయిరీ రైతుల సంక్షేమానికి కట్టుబడి అనేక విధాలుగా సాయం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షుడు సన్యాసినాయుడు, డైరెక్టర్ పెట్ల బాబులు, పాడి రైతులు పాల్గొన్నారు.

చందనాడలో లేగదూడల ప్రదర్శన



పశువులకు వైద్యం చేస్తున్న ఏడీ డాక్టర్ వీర్రాజు

నక్కపల్లి: చందనాడలో గురువారం పశువైద్య శిబిరం, లేగదూడల ప్రదర్శన, ఎంపిక నిర్వహించారు. నక్కపల్లి పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ వీర్రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో పలు గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలకు వైద్య సేవలు అందించారు. సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల పెంపకందార్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. పశుబీమాను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ వీర్రాజు సూచించారు. నట్టల నివారణ గురించి తెలియజేశారు. పెయ్యిలకు ముర్రుపాలు తాగించడం ఎంతో మంచిదన్నారు. కార్యక్రమానికి వచ్చిన 40 లేగదూడలను ప్రదర్శించారు. వీటిలో మూడు లేగదూడలను ఎంపిక చేసి, వాటికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ, రాష్ట్రీయ గోకుల మిషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జానకయ్యపేట వెటర్నరీ డాక్టర్ కృపావతి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి నమూనా పరీక్ష



ప్రశ్న పత్రాన్ని విడుదల చేసిన ఉపాధ్యాయులు



మోడల్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పాయకరావుపేట: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలో పదో తరగతి విద్యార్థులకు నమూనా పరీక్ష నిర్వహించామని జిల్లా అధ్యక్షుడు ఎం.బాలాజీ గురువారం తెలిపారు. ప్రశ్న పత్రాన్ని గరల్స్ హైస్కూల్ హెచ్‌ఎం డి.ఎస్. భవాని, రామారావు, రత్నమని, వరలక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విడుదల చేశారు. ఈ సందర్భంగా గరల్స్ హైస్కూల్ హెచ్‌ఎం భవాని మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి నమూనా పరీక్షలు నిర్వహించడం వల్ల రానున్న పోటీ పరీక్షలకు, వారి ఫైనల్ ఎగ్జామినేషన్‌కు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలు అలవాటు పడకుండా క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. విద్యార్థుల్లో ఉన్న భయాందోళన పోగొట్టేందుకు వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని జిల్లా అధ్యక్షుడు బాలాజీ తెలిపారు. ఇక్కడే కాకుండా అచ్యుతాపురం మండలంలో 400 పైగా పదో తరగతి విద్యార్థులు నమూనా పరీక్ష రాశారని, పది రోజుల్లో ఫలితాలు వెల్లడించి, బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు

ఎస్.రాయవరం: గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసంలో ఎస్.రాయవరంలోని బజారులో స్టేజ్‌పై నిలిపిన గౌరీ పరమేశ్వరుల విగ్రహాలకు మూడు నెలలుగా పూజలు చేస్తున్నారు. ఈ మేరకు భక్తులు సారె ఊరేగింపు నిర్వహించారు. శనివారం ఉత్సవ మూర్తుల అనుపు ఉత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు భీమరశెట్టి అప్పారావు, కొణతాల శ్రీనివాసరావు, గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొణతాల ఉమాదేవి పాల్గొన్నారు.

అనధికార మద్యంవిక్రయాలపై దాడులు



దాడులు చేస్తున్న ఎక్సైజ్ సీఐ లక్ష్మీనాయుడు

కశింకోట: అనకాపల్లి ఎక్సైజ్ సీఐ లక్ష్మీనాయుడు, తమ సిబ్బందితో స్థానిక సంతబయల, పూసర్ల వీధి ప్రాంతాల్లో మద్యం దుకాణాల వద్ద పక్కన లూజు విక్రయాలు జరుగుతుండటంతో ఆకస్మిక దాడి చేశారు. ఈ విషయం తెలియడంతో నిర్వాహకులు పరారయ్యారు. ఇకపై లూజు అమ్మకాలు విక్రయిస్తే ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. అనధికారిక మద్యం అమ్మకాలు సాగకుండా దాడులు చేస్తున్నామన్నారు.

మహాత్మునికి ఘన నివాళి



నక్కపల్లిలో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నక్కపల్లి: మహాత్ముని అడుగు జాడల్లో నడుస్తూ.. ఆయన ఆశయాలను తూచ తప్పకుండా పాటించినప్పుడే నిజమైన నివాళి అర్పించినట్లని ఎంపీడీవో సీతారామరాజు అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అహింసా మార్గం ద్వారానే దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చి మహనీయుడు గాంధీజీ అన్నారు. అటువంటి మహనీయుడిని స్మరించుకోవడం మనందరి కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు రాజశేఖర్, హౌసింగ్ ఏఈ జగన్, వెలుగు ఏపీవో శ్రీనివాస్, సిబ్బంది మూలపూరి మూర్తి పాల్గొన్నారు.

అచ్యుతాపురం: మండలంలో పలు చోట్ల మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో భాగంగా గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి జాతిపిత చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అచ్యుతాపురం ప్రభుత్వ కార్యాలయాల వద్ద గాంధీ విగ్రహానికి సర్పంచ్ భర్త కూండ్రపు విమలనాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక యువకులు పాల్గొన్నారు.

కోటవురట్ల: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని గురువారం నిర్వహించారు. రాజుపేట ఎంపీయూపీ స్కూల్‌లో హెచ్‌ఎం నానిమణిమోహన్ ఆధ్వర్యంలో మహాత్ముని విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మహాత్ముని ఆశయాలు ఆచరణీయమని, శాంతి మార్గంలో యువత ముందుకు నడవాలన్నారు. కార్యక్రమంలో రాజుపేట సర్పంచ్ బి.వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అచ్యుతాపురంలో గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న విమలనాయుడు, తదితరులు



రాజుపేట స్కూల్‌లో మహాత్మునికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు,

బ్రాండిక్స్ పరిశ్రమలో శ్రమ దోపిడీ

- యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్



యలమంచిలిలో మాట్లాడుతున్న ఎంపీపీ బోదెపు గోవింద్

యలమంచిలి: బ్రాండిక్స్ పరిశ్రమలో శ్రమ దోపిడీ జరుగుతుందని ఎంపీపీ బోదెపు గోవింద్ విమర్శించారు. పరిశ్రమలో కార్మికుల పనివేళల పెంపును నిరసిస్తూ పెద్ద ఎత్తున మహిళా కార్మికులు ఆందోళన చేపట్టిన నేపథ్యంలో యలమంచిలిలో గురువారం ఆయన స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లతో కలసి మాట్లాడారు. ప్రస్తుతం పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల పనివేళలలో అరగంట ఎక్కువగా పని చేయాలని ఒత్తిడి తీసుకురావడం సమంజసం కాదన్నారు. కార్మిక చట్టం ప్రకారం రోజుకు 8 గంటలే పనిచేయాలని, కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్ ఇచ్చి భద్రత కల్పించాలన్నారు. ఇందుకు విరుద్ధంగా ఏ షిఫ్ట్‌కు వెళ్లేవారు తెల్లవారుజామున 3 గంటలకు లేవాల్సిన పరిస్థితి ఉందన్నారు. మధ్యాహ్నం విధులకు వెళ్లే వారు 12.30కు ముందుగా వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. దీనివల్ల ఇంట్లో పనులు చేసుకుని వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చాలీచాలని వేతనాలకు గంటల తరబడి కుటుంబ పోషణ కోసం పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఇటువంటి పరిస్థితి లేదన్నారు. కార్మికుల పక్షపాతిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేసిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులను వేధిస్తున్నారని, వారి సమస్యలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పరిశ్రమల యాజమాన్యాలకు కొమ్ముకాస్తుందన్నారు. పనివేళల పెంపు నిర్ణయం వెనక్కి తీసుకుని, జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మరిణేశ్వరరావు, రాపేటి సంతోష్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక: ప్రతి ఒక్కరూ కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాకకు చెందిన దొడ్డి అప్పారావు–చినతల్లి దంపతుల జ్ఞాపకార్థంగా కుమారులు గణేష్, రమణ, గోవింద, మనుమలు రామ్మోహనరావు, హరీష్, ప్రసాద్ రూ.2 లక్షల విరాళాన్ని కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో మళ్ల సంజీవరావు, పెంటకోట ఉమేష్, ఆడారి అచ్చియ్యనాయుడు, ఆడారి లక్ష్మణరావు, సూరిశెట్టి దుర్గునాయుడు, ఆడారి గోపి, వెలగా వెంకటప్పారావు, బొడ్డేడ సోమరాజు, కర్రి కోటి తదితరులు పాల్గొన్నారు.

70 పశువులకు వైద్య పరీక్షలు




పశువులకు వైద్య పరీక్షలు అందిస్తున్న పశు వైద్యాధికారి శివకుమార్

అచ్యుతాపురం: మండలంలోని దుప్పుతూరులో ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ శిబిరంలో దోసూరు పశు వైద్యాధికారి డాక్టర్ కే శివకుమార్ 70 పశువులకు గర్భకోశ, ఇతరత్రా వైద్య పరీక్షలు చేశారు. వంద మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు తాపించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద రైతులు పశుగ్రాస సాగు చేసుకోవచ్చన్నారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డు సహాయంతో సబ్సిడీ రుణాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో దోసూరు లైవ్‌స్టాక్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, గోపాలమిత్ర రామారావు, రవి చంద్ర, కాసుబాబు, ఏహెచ్‌ఏ సునీల్, పాడిరైతులు పాల్గొన్నారు.

ఏలేరు కాలువకు రక్షణ గోడ నిర్మించాలి

వాహనదారుల నిరసన



నిరసన చేస్తున్న వాహనదారులు

తుమ్మపాల: మండలంలో శంకరం–బొజ్జన్నకొండ వద్ద ఏలేరు కాలువకు రక్షణ గోడ నిర్మించి తమ ప్రాణాలు కాపాడాలంటూ ఆమ్‌ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో వాహనదారులు గురువారం నిరసన చేపట్టారు. ఏలేరు కాలువ నిర్మించిన నాటి నుంచి 20 మందికి పైగా అదుపుతప్పి అందులో పడి మృతి చెందారని పార్టీ జిల్లా అధ్యక్షుడు కొణతాల హరినాథ్‌బాబు తెలిపారు. కాలువ ఆనుకుని బొజ్జన్నకొండ రహదారి ఉన్నందున వాహనదారులు రాకపోకలకు జంకుతున్నారన్నారు. అధికారులు స్పందించి ఏలేరు కాలువకు రక్షణ గోడ నిర్మించాలని డిమాండ్ చేశారు. బొజ్జన్నకొండ రోడ్డుపై క్వారీ టిప్పర్ల రాకపోకలను నిలిపివేయాలన్నారు. మహాలక్ష్మినాయుడు, మహిళలు పాల్గొన్నారు.